ప్రజాశక్తి
ఆదివారం 24 డిసెంబర్ 2023

పోలీస్‌స్టేషన్‌కు హోంగార్డులను అందిస్తాం : డిఐజి

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస పోలీస్ స్టేషన్‌కు పని ఒత్తిడి దృష్ట్యా హోం గార్డులను నియమిస్తామని విశాఖ రేంజ్ డిఐజి ఎస్. హరికృష్ణ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తవలసలో పోలీస్ సేవలు సక్రమంగానే ఉన్నాయన్నారు. సిడి ఫైల్స్, ఇతర ఫైల్స్‌ను రిజిస్ట్రేషన్ చేశారు. రికార్డులు సక్రమంగా ఉన్నాయని కితాబిచ్చారు. ఎస్.కోట ప్రాంతం గుండా గంజాయి, ఇతర స్మగ్లింగ్ గూడ్స్ అరికట్టడానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో విజయనగరం ఎఎస్‌పి అస్మా ఫారహేన్, విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు, కొత్తవలస సిఐ చంద్రశేఖర్, ఎస్‌కోట సిఐ ఎస్. బాల సూర్యారావు, కొత్తవలస, ఎస్.కోట సర్కిల్ పరిధిలో వున్న ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గరివిడి: స్థానిక పోలీస్ స్టేషన్‌ను డిఐజి హరికృష్ణ, ఎఎస్‌పి, డిఎస్‌పి చక్రవర్తితో కలిసి పరిశీలించారు. స్టేషన్‌లోని సీడీ ఫైల్స్‌ను, స్టేషన్ పరిసరాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. సిఐ ఉపేంద్ర రావు, ఎస్ఐ దామోదర రావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టుకార్డులతో ముఖ్యమంత్రికి మొర

- రోడ్లపై కూర్చొని అంగన్‌వాడీల భోజనాలు
- మద్దతు తెలిపిన ఫ్యాప్టో, టిడిపి నాయకులు
- జిల్లా వ్యాప్తంగా పోస్టుకార్డు ఉద్యమం
- గంట్యాడలో సెల్‌ఫోన్లకు పూజలు

ప్రజాశక్తి - విజయనగరంటౌన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. అయినా ప్రభుత్వం స్పందించక పోవడంతో అంగన్‌వాడీలోతో పోస్టుకార్డు ఉద్యమం ద్వారా ముఖ్యమంత్రికి మొరపెట్టుకున్నారు. తమ సమస్యలపై స్పందించాలని కోరుతూ ఉత్తరాలు రాసి పోస్టు చేశారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె దీక్ష కార్యక్రమంలో పోస్ట్ కార్డులు రాసి పోస్టు చేశారు. అనంతరం రహదారిపై భోజనాలు చేశారు. పిల్లలకు అన్నం పెట్టే చేతులతో రోడ్ల పైన అన్నం తినాల్సిన స్థితికి ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు ఐద్వా నాయకులు పి.రమణమ్మ, ఫ్యాఫ్టో ఉపాధ్యాయ సంఘాలు యుటిఎఫ్, ఎస్‌టియు, పి అర్‌టియు, ఎపిటిఎఫ్, ఆప్టా, బిటిఎ, ప్రధానోపాధ్యాయుల సంఘాల నాయకులు డి.రాము, వై.అప్పారావు, డి శ్రీనివాసరావు, బంకపల్లి శివప్రసాద్, శ్రీకాంత్, భాస్కర్ రావు, సదాశివరావు, సన్యాసి రాజు, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి బాబ్జి తదితరులు మద్దతు తెలిపారు.

గజపతినగరం : తమ సమస్యలను తెలియజేస్తూ రాసిన పోస్టుకార్డులను ముఖ్యమంత్రికి పంపించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి జ్యోతి, అధ్యక్షులు సుభాషిని నాయకత్వం వహించారు. కార్యక్రమంలో రమణమ్మ, సన్యాసమ్మ, లక్ష్మి, నారాయణమ్మ, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ : మండల కేంద్రంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనసూయమ్మ ఆధ్వర్యాన సెల్‌ఫోన్లకు పూజలు చేస్తూ నిరసన తెలిపారు. ఫోన్లు వచ్చిన తరువాత అంగన్‌వాడీలంతా అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన చెందారు.

శృంగవరపుకోట : అంగన్‌వాడీల సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మద్దతు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, చెలికాని ముత్యాలు, యూనియన్ నాయకులు డి.శ్యామల, డి.జయలక్ష్మి, కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

జామి : తెలంగాణ కంటే అదనపు వేతనం పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని కోరుతూ సిఎంకు పోస్టుకార్డులు పంపించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడారు. ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, విష్ణుమ్మ, రామలక్ష్మి, కనకమహాలక్ష్మి, వరలక్ష్మి,దేవుడమ్మ, ఆదిలక్ష్మి, అధిక సంఖ్యలో వర్కర్స్ పాల్గొన్నారు.

భోగాపురం : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అంగన్వాడీలకు జీతాలు పెంచుతామని నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. తాహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న సమ్మెలో ఆయనతోపాటు నాలుగు మండలాలకు చెందిన నాయకులంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలను గతంలో ఆదుకున్నది చంద్రబాబు నాయుడని అన్నారు. జీతాలు పెంచుతామని మాట ఇచ్చి మడమ తిప్పిన జగన్‌కు బుద్ధి చెప్పాలన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక అంగన్వాడీలను చంద్రబాబు నాయుడు ఆదుకుంటారని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి. సూర్యనారాయణ, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, డెంకాడ, పూసపాటిరేగ మాజీ జెడ్‌పిటిసిలు అప్పలనారాయణ, ఆకిరి ప్రసాద్ రావు ,రాష్ట్ర మత్స్యకార సాధికార సమితి కన్వీనర్ మైలపల్లి సింహాచలం, రెల్లివలస సర్పంచ్ ఇజ్జిరోతు ఈశ్వరరావు, మండల సీనియర్ నాయకులు నీలాపు అప్పలరామి రెడ్డి, క్లస్టర్ ఇంఛార్జి దాసరి అప్పలస్వామి యూనియన్ నాయకులు కష్ణవేణి, కొర్లమ్మ, అనిత, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : సమ్మెకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బంగారి యుగంధర్, గౌరవ అధ్యక్షులు పి శంకర్రావు మద్దతు తెలిపారు.

విజయనగరం : రహదారిపై భోజనాలు చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

గజపతినగరం : పోస్టుకార్డులను సిఎంకు పంపుతున్న అంగన్‌వాడీలు

రాజాం : రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సమస్యల పరిష్కారంపై మొండిగా వ్యవహరిస్తే పోరాటాన్ని ఉధృతం చేస్తామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు వి. లక్ష్మి అన్నారు. రాజాంలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే క్రిస్మస్ తర్వాత పోరాటాన్ని ఉదతం చేస్తామని హెచ్చరించారు. సి ఐటియు నాయకులు రామ్మూర్తినాయుడు, యూనియన్ నాయకులు సుశీల, ధవలేశ్వరి, దమయంతి, వరలక్ష్మి, అనురాధ, రాంబాయి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి : అంగన్‌వాడీలంతా సిఎంకు పోస్టుకార్డులు రాసి తమ నిరసన తెలిపారు. సమ్మెకు సిఐటియు రాష్ట్ర నాయకులు టివి రమణ, జిల్లా నాయకులు అంబళ్ల గౌరినాయుడు తమ సంపూర్ణ మద్దతుని తెలిపారు. కార్యక్రమంలో చీపురుపల్లి మండలంలో గల అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



ఎస్.కోటలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పి చైర్మన్ శ్రీనివాసరావు

రంగుమారిన ధాన్యం కొనాలి

- మూడు రోజుల్లోనే బిల్లుల చెల్లింపు
- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-విజయనగరం

మిల్లర్లు రంగు మారిన ధాన్యాన్ని వెనక్కి పంపితే సహించేది లేదని, రైతుల నుండి వచ్చే ప్రతి గింజను కొనుగోలు చేయాలనీ జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలుపై ఎలాంటి ఫిర్యాదులు అందినా ఆ మిల్లుల పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో జరిగింది. సమావేశం లో పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ రైతులకు అన్‌లోడ్ ఛార్జీలను, ట్రాన్స్‌పోర్టు ఛార్జీలను వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ధాన్యం డబ్బులు 2 లేదా 3 రోజుల్లోనే వేస్తున్నామన్నారు. జిల్లాలో ఇంతవరకు 63 వేల 845 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కోనుగోలు చేసి 11,326 మంది రైతులకు బిల్లులు చెల్లించామన్నారు. సుమారు 100 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేయగా 82 కోట్ల రూపాయలచెల్లింపులు జరిగాయన్నారు. సుమారు 19 లక్షల గోనె సంచులను సరఫరా చేశామన్నారు. ఎఆర్‌బికె పరిధిలో ఎక్కువగా అవసరం ఉందో ఇండెంట్ పెడితే అక్కడ ఎక్కువగా గన్నీలు సరఫరా చేస్తామన్నారు. సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రైతుల సమస్యలను పరిష్కరించడానికి కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామన్నారు. మిల్లర్ల నుండి ఏవైనా కొర్రీలు ఉంటె కాల్ సెంటర్ కు రైతులు నేరుగా ఫోన్ చేయాలని తెలిపారు. మొక్కజొన్న సేకరణకు కూడా ఉత్తర్వులు అందాయని ఈ ఏడాది సుమారు 40 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు ను అంచనా వేస్తున్నామని తెలిపారు. సమావేశంలో డిసిఎంఎస్ చైర్మన్ అవనాపు భావన, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామా రావు, పశు సంవర్ధక శాఖ జెడి విశ్వేశ్వర రావు , మత్స్య శాఖ డిడి నిర్మలా కుమారి, ఎఎబి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

25న స్పందన రద్దు

ప్రజాశక్తి-విజయనగరం

క్రిస్మస్ పండగ కారణంగా ఈనెల 25న సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయిలో ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం జగనన్నకు చెబుదాం నిర్వహించడం లేదని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత తెలిపారు. ప్రజలంతా ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు.

కలెక్టరేట్ వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

కళ్లకు గంతలతో నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారానికి నాలుగో రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా కలెక్టరేట్ వద్ద కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి రాష్ట్ర కార్యదర్శి గురువులు మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేసి, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికిసమాన వేతనం కల్పించాలన్నారు. యంటియస్ అమలు చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి ప్రతి నెలా 1వ తేదీకి వేతనాలు చెల్లించి, వార్షిక బడ్జెట్ ఒకేసారి విడుదల చేయాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవులుమంజూరు చేయాలని, గ్రాడ్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఉపాధ్యాయుడి మరణానికి కారణమైన

అధికారులపై చర్యలు తీసుకోవాలి

జెసికి ఫ్యాప్టో నాయకుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రేగిడి ఆముదాలవలస మండలం కాగితాపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధాన ఉపాధ్యాయులు రంప సుధాకర్ (48) మరణానికి కారకులైన విద్యా శాఖ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేదంటే ఈనెల 26న వేలాది మందితో కలెక్టరేట్ వద్ద ర్యాలీ, ప్రత్యక్ష చర్యకు దిగుతామని ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఈమేరకు శనివారం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో విద్యా శాఖ అధికారులు తనిఖీల పేరుతో ఉపాధ్యాయులను తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని అన్నారు. చిన్న చిన్న విషయాలకు ఉపాధ్యాయులను భాధ్యులు చేస్తూ క్రమ శిక్షణా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కాగితా పల్లి ఉన్నత పాఠశాల ఇంఛార్జి హెచ్‌ఎంగా పనిచేస్తున్న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రంప సుధాకర్‌ను తనిఖీల పేరుతో వేధించి సుమారు నెల రోజుల పాటు తీవ్రమైన మానసిక ఒత్తిడి కి గురి చేయడం వలన అతను ఒత్తిడి తట్టుకోలేక గుండె పోటుతో మరణించారన్నారు. కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు డి.శ్యామ్ యుటిఎఫ్ నాయకులు ప్రధాన కార్యదర్శి జెవిఆర్‌కె ఈశ్వరరావు, డి.రాము, ఎపిటిఎఫ్ 257 నాయకులు షేక్ బుకారిబాబు, పిఆర్‌టియు నాయకులు డి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి సన్యాసిరాజు, ఆప్టా నాయకులు భాస్కరరావు, ఎస్‌టియు నాయకులు అప్పారావు, బిటిఎ నాయకులు శ్రీకాంత్, ఎపిటిఎఫ్ 1938 నాయకులు సదాశివరావు, బి.శివప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు సరికాదు : ఎంఇఒల సంఘం

జిల్లా విద్యా శాఖ అధికారులపై ఉపాధ్యాయ సంఘాల ఆరోపణలు సరికాదని ఎంఇఒల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తిరుమల ప్రసాద్, రమణమూర్తి ,జయశ్రీ, అల్లు వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. డిఇఒ, డిప్యూటీ డిఇఒ లపై ఆరోపణ చేయడం వారి మనో స్థైర్యం దెబ్బతీసేలా ఉందని పేర్కొన్నారు.

సృజనా స్ఫూర్తి.. వైజ్ఞానిక దీప్తి

విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టును పరిశీలిస్తున్న జెడ్‌పి చైర్మన్

ప్రజాశకి-విజయనగరం టౌన్

నగరంలోని సెయింట్ ఆన్స్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ ఆలోచింపజేసింది. విద్యార్థులు తమ నైపుణ్యంతో తయారు చేసిన వివిధ ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, డిఇఒ లింగేశ్వర్ రెడ్డి తో కలిసి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ సిఎం జగన్ కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ కంటెంట్ కలిగిన ట్యాబ్ లను అందించి, వారిలో నైపుణ్యతను పెంపొందించి రాష్ట్రాన్ని విద్యాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శన వల్ల విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన, నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందన్నారు. విద్యార్థులు మేధావులుగా, శాస్త్రవేత్తలుగా తయారు కావాలని ఆకాక్షించారు. సాయంత్రం జరిగిన ముగింపు సభలో జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎంపికైన ప్రాజెక్టులకు సంబంధించి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

వ్యక్తిగత విభాగంలో పెరుమాళి, డోలపేట జెడ్‌పి హైస్కూళ్లు, నెల్లిమర్ల ఎంజెపిఎపి బిసి డబ్ల్యుఆర్ఇసిఎస్ పాఠశాలల విద్యార్థులు ప్రథమ, ద్వితియ, తృతీయ బహుమతులు పొందారు. గ్రూపు కేటగిరి విభాగంలో భోగాపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలకు ప్రథమం, గుజ్జంగివలస హైస్కూలుకు ద్వితీయ, పెదవేమలి హైస్కూలుకు తృతీయ స్థానం లభించాయి. టీచర్స్ కేటగిరిలో కంచరాం, కొట్యాడ, మరుపల్లి పాఠశాలలు పాధ్యాయులకు బహుమతులు లభించాయి. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులకు డిఇఒ లింగేశ్వరరెడ్డి సర్టిఫికెట్లు, షీల్డులు అందజేశారు.

ప్రథమ స్థానం సాధించిన భోగాపురం హైస్కూల్ విద్యార్థులకు సర్టిఫికెట్లు, షీల్డు అందజేస్తున్న డిఇఒ లింగేశ్వరరెడ్డి

26 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 26 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు నాయకులు ప్రకటించారు. ఈనేపథ్యంలో ఆయా మున్సిపల్ కేంద్రాల్లో శనివారం బైక్ ర్యాలీలు నిర్వహించారు. మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు ఇవ్వాలని బొబ్బిలి పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు మాట్లాడతూ ప్రభుత్వం తక్షణమే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షులు జి గౌరేష్, కార్యదర్శి జయ రామారావు, వాసు, చిన్ని కృష్ణ కార్మికులు పాల్గొన్నారు.

విజయనగరంటౌన్ : మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. జగన్మోహన్ రావు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో పర్మినెంట్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని, ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్, డ్రైవర్లకు హెల్త్ అలవెన్సు చెల్లిస్తామని, థర్డ్ పార్టీ విధానం, సిపిఎస్ రద్దు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని, నేటికీ నాలుగేళ్ల పూర్తయిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని తెలిపారు. అనేక రూపాల్లో ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడంతో నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు చెప్పారు. 2022లో మూడు నెలలు, 2023లో మూడు నెలలు జీతాలు బకాయిలు ఉన్నాయని, పిఎఫ్ ఇఎస్ఐ అమలు చేయడం లేదని అన్నారు. తక్షణమే బకాయిలు చెల్లించాలని కోరారు. అనంతరం కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడుకు వినతి అందించారు. సమావేశంలో అరుణ్, అప్పారావు, చందర్రావు, రాజు, రమేష్ నారాయణరావు , సూరి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

నెల్లిమర్ల : మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 26 నుంచి జరిగే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ నగర పంచాయతీ కార్మికులు కార్యాలయం నుంచి మొయిద జంక్షన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ రాలీని ఆ యూనియన్ జిల్లా బాధ్యులు ఎ.జగన్మోహన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు సిఎం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి యుఎస్ రవి కుమార్, సిఐటియు నగర ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ర్యాలీలో యూనియన్ నాయకులు బాబురావు, శ్రీను, హరిబాబు, లక్ష్మీ పాల్గొన్నారు.

రాజాం : సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సి హెచ్ రామ్మూర్తి నాయుడు కోరారు. స్థానిక బొబ్బిలి జంక్షన్ నుండి ఎల్ఐసి ఆఫీస్ వరకు జరిగిన బైక్ ర్యాలీని ప్రారంభించారు. యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, అనిల్ కుమార్, గురువులు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడకు వ్యతిరేక ఉచ్చు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం మెడకు ఉద్యోగులు, స్కీమ్‌వర్కర్ల వ్యతిరేక ఉచ్చు బిగుసుకుంది. హామీల అమలు, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండడంతో వీరంతా ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు. మరోవైపు ప్రభుత్వ విధానాలపై రైతుల్లోనూ అసహనం పెరుగుతోంది. ఓవైపు వివిధ తరగతులకు చెందిన ప్రజానీకం నిరసన హోరు తారా స్థాయికి చేరుతుంటే, ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' అంటూ కొత్త ఆటకు తెరలేపింది. మరోవైపు ప్రభుత్వంతోపాటు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు రాజకీయ చదరంగంలో బిజిబిజీగా ఉన్నారు. బహుశా అందుకేనేమో గడిచిన పది రోజులుగా జిల్లా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన దీక్షలతో అట్టుడుకుతున్నా, పలు రంగాలకు చెందిన స్కీమ్ వర్కర్లు సమ్మెసైరన్ మోగించినా స్పందించడం లేదు. పైగా బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చినఅప్పలనాయుడు 'ఒళ్లు బలిసి రోడ్లమీదకు వస్తున్నారు' అంటూ అంగన్‌వాడీలపై అణుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై అంగన్‌వాడీలతోపాటు పలు ట్రేడ్ యూనియన్లు, ఉద్యోగ, కార్మిక సంఘాలు కూడా ఘాటుగానే స్పందించడంతో ఆ ఎమ్మెల్యేకు తిరిగి సమాధానం చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఈ సంగతి కాస్త అటుంచితే, తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెలోకి దిగి 12 రోజులు కావస్తోంది. ఇప్పటి వరకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించ లేదు. పైగా సమ్మె విరమించాలంటూ జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ నిన్నగాక మొన్న విశాఖపట్నంలో కోరారు. రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో అసలు వేతనాలు పెంచే ప్రసక్తే లేదని తెగేసి చెప్పేశారు. తగ్గేదే లే అన్నట్టుగా అంగన్‌వాడీలు తమ సమ్మెను కొనసాగించడంతోపాటు మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతున్నారు. ఈనేపథ్యంలో సిపిఎం తదితర వామపక్ష పార్టీలు మరో అడుగు ముందుకు వేసి, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే తమ ప్రత్యక్ష మద్దతు ప్రకటిస్తామని చెప్పాయి. ఇప్పటికే నల్ల రిబ్బన్లు కట్టుకోవడం, మోకాళ్లపై నిలబడడం, వంటావార్పు, ధర్నాలు, రాస్తారోకో తదితర రూపాల్లో నిరసన వ్యక్తం చేసిన అంగన్‌వాడీలు మౌనం వీడి సిఎం జగన్, వైసిపి ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా గళం విప్పుతూ ఆటపాటలకు తెరలేపారు. మరోవైపు తాళాలు పగలుగొట్టి మరీ సచివాలయ ఉద్యోగులతో కేంద్రాలను తెరిపిద్దామని ప్రభుత్వం భావించిన పరిస్థితుల్లో పిల్లల తల్లిదండ్రులు కూడా అంగన్‌వాడీలకే మద్దతు తెలపడంతో ప్రభుత్వ వ్యూహం బెడిసికొట్టింది. ఈనేపథ్యంలో ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామంటూ అంగన్‌వాడీలు దీక్షబూనారు. ఇంకోవైపు తమ సమస్యలు పరిష్కరించకపోతే ఖబడ్దార్ అంటూ ఆశావర్కర్లూ ఆందోళన చేస్తున్నారు. సర్వశిక్షాభియాన్ పరిధిలోని 18 విభాగాలకు చెందిన కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నాలుగు రోజులుగా సమ్మెబాట పట్టారు. అంగన్‌వాడీలు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మెను ఆదర్శంగా తీసుకున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు కూడా తమ సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 26నుంచి సమ్మెలోకి వెళ్తామంటూ ఇప్పటికే కమిషర్లకు సమ్మెనోటీసులు అందజేసిన సంగతి తెలిసిందే. విఆర్ఎగా ప్రమోషన్ ఇవ్వడంతోపాటు పేస్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ విఆర్ఎలు ఆందోళన బాటపట్టారు. ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఇటీవల కాలంలో ఇరు జిల్లాల్లోనూ ర్యాలీలతో నిరసన తెలిపారు. తమకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని, పని ఒత్తిడి, వేధింపులకు పాల్పడుతున్నారని, ఉపాధ్యాయులు చాలా కాలంగా గుర్రుగా ఉన్నాయి. ధరలో దగా, తూకంలో మోసం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు, రైతు సంఘం నాయకులు వినతులు, వార్నింగులతో ప్రభుత్వ వైఖరిని ఎండగడుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వం భరతం పడతామంటూ సిపిఎం ఆధ్వర్యాన వామపక్ష పార్టీలన్నీ ఇటీవల ఒక్క తాటిపైకి వచ్చిన సంగతి తెలిసిందే. జిల్లాలో జ్యూట్, చక్కర పరిశ్రమలను తెరిపించాలని, కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, తోటపల్లి, జంఝావతి సహా అనేక గెడ్డలపై ప్రతిపాదనలోవున్న మినీ రిజర్వాయర్లను నిర్మించాలని, మన్యం జిల్లాలో మెడికల్ కాలేజీ నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని, గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన ఇటీవలే సమర శంఖారావం మోగించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వానికి ఇవేవీ పట్టకపోవడంతో కేవలం ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లే కాకుండా రైతులు, పేద, మధ్యతరగతి ప్రజానీకంలో వ్యతిరేకత పెరుగుతోంది.

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నల్లబ్యాడ్జీలతో ఎనర్జీ అసిస్టెంట్ల నిరసన

భోగాపురం: సచివాలయంలో పనిచేస్తున్న విద్యుత్ శాఖకు చెందిన ఎనర్జీ అసిస్టెంట్లు భోగాపురం సెక్షన్ కార్యాలయం వద్ద శనివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తామంతా సచివాలయం ద్వారా ఎంపికైనప్పటికీ సచివాలయ అలవెన్సులు ప్రభుత్వం కల్పించట్లేదన్నారు. సచివాలయ పని వేళల్లోననే విధులు అప్పగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసోసియన్ పిలుపుమేరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపామని చెప్పారు.

అధికారులతో సమీక్ష

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం మండల స్థాయి అధికారులతో మండల ప్రత్యేకాధికారి వి.లక్ష్మీనరసింహం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని, ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ప్రాధాన్యతను గురించి వివరించారు. అనంతరం అసంపూర్తి గృహాలను త్వరితగతిని పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ పట్నాయక్, ఇఒపిఆర్‌డి ఉమా, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్, హౌసింగ్ ఎఇ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇఇ, పిఆర్ జెఇ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

చాకివలసలో అన్నదాత దివాస్

భోగాపురం: మండలంలోని చాకివలస గ్రామంలో భోగాపురం స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో అన్నదాత దివాస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా పంట రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించిన చాకివలస గ్రామానికి చెందిన 15 మంది రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా విజయనగరం రీజనల్ క్రెడిట్స్ మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులకు పంటలపై తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చి వారు ఆర్థికంగా ఎదగడమే స్టేట్ బ్యాంక్ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. భోగాపురం ఎస్‌బిఐ ఎసిబి మేనేజర్ ఎన్ వెంకటలక్ష్మి, ఎస్‌బిఎమ్ డి. విద్యాసాగర్, డిప్యూటీ మేనేజర్ కె భవానీ శంకర్, ఫీల్డ్ ఆఫీసర్ జి.సత్యన్నారాయణ, గ్రామ పెద్దలు రాము, రామనర్సి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

శృంగవరపుకోట: స్థానిక భవానీనగర్‌లో శనివారం శ్రీ గౌరీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బిషప్ వి జాషువా, పాస్టర్ డేవిడ్ పాల్ హాజరై మాట్లాడారు. పిల్లల ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ఈ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మెడికల్ క్యాంప్‌ను డాక్టర్ టోనీ, ఫెయిత్ ఎవాంజెలికల్ మెడికల్ సౌజన్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాండ్రేగుల వెంకట్రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

సిఎస్‌సి సేవలను వినియోగించుకోవాలి

భోగాపురం: కామన్ సర్వీసు సెంటర్ల (సిఎస్‌సి) సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని విజయనగరం సిఎస్‌సి మేనేజర్లు కోటేశ్వరరావు, నాగార్జునలు కోరారు. సిఎస్‌సిల ద్వారా ప్రజలు ఉచితంగా న్యాయ సలహాలు పొందవచ్చునని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ, ఈ శ్రమ మొదలగు కేంద్ర ప్రభుత్వ పథకాలు రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు.

విద్యుత్ ఛార్జీలపై బిజెపి నిరసన

విజయనగరం కోట : వైసిపి ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పడేలా విద్యుత్ యూజర్ ఛార్జీలను, ట్రూ అప్ ఛార్జీలను పెంచడం అన్యాయమని, వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఆధ్వర్యాన శనివారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. కోట జంక్షన్ నుంచి మూడులాంతర్లు మీదుగా గంటస్తంభం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం అక్కడ రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు నడుకుదుటి ఈశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పేరు జగన్మోహన్ రెడ్డి కాదని పేదలు, మధ్యతరగతి ప్రజల పాలిట జగన్ మోసం రెడ్డి అని విమర్శించారు. కరెంట్ ఛార్జీల భారం తగ్గిస్తానని, పేద రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తానని, 200 యూనిట్లు లోపు వాడిన వారికి యూనిట్ రూ.2కే ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీరాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమంచి సుబ్బారావు, జిల్లా అధికార ప్రతినిధి భవిరెడ్డి శివప్రసాద్ రెడ్డి, నాయకులు తీగెల అచ్యుత హరనాధ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బొబ్బిలి శ్రీను, రాజేష్ వర్మ, పాల్గొన్నారు.

వాణీ పద్మజకు సత్కారం

బొబ్బిలి: పట్టణంలోని పద్మాలయ డాన్స్ అకాడమీ ఏర్పాటు చేసి చిన్నారులకు నాట్యం నేర్పిస్తున్న జి.వాణీ పద్మజను ఏలూరుకు చెందిన అభినయ నృత్య భారతి నిర్వాహకులు సత్కరించారు. అభినయ నృత్య భారతిలో నాట్యం నేర్చుకుని చిన్నారులకు నేర్పించడంలో ఆమె కృషిని గుర్తించి వార్షికోత్సవం సందర్భంగా ఏలూరు శ్రీకానాల గురుమూర్తి కళావేదికలో వాణి పద్మజను సత్కరించారు. తనకు సత్కారం చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఆమె తెలిపారు.

నేడు విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

భోగాపురం: ప్రతిభ ఉన్నప్పటికీ ఎంతో మంది ఫీజుల భారం కారణంగా చదువుకు దూరమవుతున్న పరిస్థితిని చూసి అలాంటి వారందరికీ స్కాలర్షిప్‌లు అందజేయనున్నట్లు జనసేన నెల్లిమర్ల నియోజకవర్గం నాయకులు లోకం మాధవి తెలిపారు. భోగాపురం లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం పేద విద్యార్థులకు స్కాలర్షిప్‌లు అందిస్తామన్నారు. పేద విద్యార్థులకు తమ వంతు సహాయంగా రూ.2.50లక్షలు పంపిణీ చేయనున్నామని ఆమె తెలిపారు.

విద్యార్థులకు ట్యాబులు అందజేత

బొండపల్లి : మండలంలోని గరుడబిల్లి, బొండపల్లి ఉన్నత పాటశాలల్లో శనివారం విద్యార్థులకు ఎంపిపి చల్ల చలంనాయుడు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్య కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. విద్యార్థులలో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రభత్వం వివిధ బోధనా పద్ధతులు అమలు చేస్తుందన్నారు. దీనిలో భాగంగానే విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ అల్లు వెంకటరమణ, వైస్ ఎంపిపి గొండెల ఈశ్వర రావు, వైసిపి మండల అద్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, సర్పంచ్‌లు బొద్దల కృష్ణవేణి, బొండపల్లి ఈశ్వరరావు, ఎంపిటిసి బండారు శ్రీనువాస రావు, ఉప సర్పంచ్ కోళ్ళ వెంకటరమణ, హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మెన్ గెద్ద సత్యనారాయణ, స్కూల్ హెచ్‌ఎమ్‌లు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

విజయనగరం: చలికి ఇబ్బంది పడుతు వణుకుతూ రహదారులపై నిద్రించే వృద్ధులు, నిరాశ్రయులు, అభాగ్యులు, అనాథలకు విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. జిల్లా మొత్తం తిరిగి సుమారు 100 మందికి పైగా దుప్పట్లు అందజేసినట్లు యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ ఇల్తామష్ తెలిపారు. కార్యక్రమంలో యూత్ ఫౌండేషన్ సభ్యులు అశోక్,సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రాము, రఘు, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విజ్ఞానంతో ఎదగాలి : ఛాన్సలర్

- డిగ్రీలతో సరిపెట్టుకోవద్దు.. • సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి • ఘనంగా సెంచూరియన్ మూడో స్నాతకోత్సవం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థులు డిగ్రీ పట్టా అందుకోవడంతోనే సరిపెట్టుకోకుండా నిరంతర విజ్ఞానంతో పైకి ఎదగాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు పిలుపునిచ్చారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవ వేడుకల సందర్భంగా శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత సవాళ్లను ఎదుర్కొనే విధంగా వారిని తీర్చిదిద్దుతున్నామన్నారు. అందుకు అనుగుణంగా కోర్సులను రూపొందించడం, పరిశోధన కేంద్రాలు ఏర్పాటు, ఆవిష్కరణల దిశగా పయనించడానికి అవసరమైన వాతావరణాన్ని కల్పించామన్నారు. ప్రతి విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి దిశగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానం-2020 ప్రవేశపెట్టక ముందర నుంచే ఇక్కడ ఆ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా

అతిథుల నుంచి బంగారు పతకాలను అందుకున్న విద్యార్థులు

పాల్గొన్న లార్సెన్ అండ్ టోబ్రో ఇన్ఫొటెక్ చీఫ్ సస్టయినబిలిటీ ఆఫీసర్ పనీష్ రావు మాట్లాడుతూ తనకు గౌరవ డాక్టరేట్ అందించడం ఆనందంగా ఉందన్నారు. విశ్వవిద్యాలయం అన్ని రంగాలలో ముందడుగులో ఉందన్నారు. తన అనుభవాలను పంచుకున్నారు. విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డి.ఎన్.రావు మాట్లాడుతూ 2017 నుంచి ఎపి క్యాంపస్ లో కోర్సులు నిర్వహిస్తున్నామని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా వారిని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కిషోర్ మహంతి మాట్లాడుతూ ఇప్పటి వరకు విశ్వవిద్యాలయంలో అమలు చేస్తొన్న కోర్సులు వాటి ప్రగతి గురించి వివరించారు. నేడు పణీష్‌రావుకు గౌరవ డాక్టరేట్ ను, 140 మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేస్తున్నామన్నారు. 12 మంది విద్యార్థులకు బంగారు పతకాలను అందజేస్తొన్నామని వివరించారు. అనంతరం విశ్వవిద్యాలయ అధ్యక్షులు ప్రొఫెసర్ ముక్తి కాంత్ మిశ్రా, ఇతర అతిథుల చేతుల మీదుగా బంగారు పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, ఒడిశా విశ్వవిద్యాలయం వీసీ సుప్రియ పట్నాయక్, రిజిస్ట్రార్ అనితా పాత్రా, డీన్ ప్రొఫెసర్ రమణారావు, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ డాక్టర్ సన్నీడయోల్, డీన్ ప్రొఫెసర్ మురళీ, డాక్టర్ పుష్పలత, తదితర అధ్యాపక సిబ్బంది, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పత్రాలను అందిస్తున్న ఉపాధ్యాయుడు

ఆదుకున్న ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని చిన్న లింగాలవలస గ్రామానికి చెందిన పప్పల చంద్రినాయుడు చిన్న వయసులో అకాల మరణం చెందారు. మృతుడుకు భార్యతో పాటు ఇద్దరు చిన్నారులున్నారు. అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు పొగిరి మోహనరావు తన స్నేహితులైన 10వ తరగతి, ఇంటర్ పూర్వ విద్యార్థులతో కలసి 1,27,500 విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని చిన్నారి పేరున సుకన్య సమృద్ధి యోజన పథకం ఖాతాలో జమ చేసి తమ ఔన్నత్యాన్ని చాటుకున్నారు. వాటి పత్రాలను శనివారం మృతుని భార్యకు రెడ్డి అప్పలనాయుడు, ఉపాధ్యాయులు మోహన్ రావు అందజేశారు.

'ఆడుదాం ఆంధ్ర'పై ర్యాలీ

ప్రజాశక్తి- బొబ్బిలి

ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై శనివారం పట్టణంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణం, మండలంలో ఉన్న యువతి, యువకులు, 60 సంవత్సరాలు లోపు ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ ఆడుదాం ఆంధ్రాలో పాల్గొనవచ్చునన్నారు. యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తొలిసారిగా 'ఆడుదాం ఆంధ్రా' అనే క్రీడా మహోత్సవాన్ని ప్రారంభించిందన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో ఆటలను ప్రమోట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యస్.శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి భాస్కర్ రావు, మున్సిపల్ మేనేజర్ శివ ప్రసాద్, టిపిఆర్ఒ జగన్మోహన్ రావు, ఆర్ఒ ప్రసాద్, మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది, వార్డ్ వాలెంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాపై సమీక్ష

పట్టణంలోని అన్ని సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, సచివాలయాల ఇన్చార్జిలు, నోడల్ ఆఫీసర్లు, పి.ఈ.టిలతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. క్రికెట్, ఖోఖో, షటిల్, వాలీబాల్, కబడ్డీ క్రీడల్లో స్త్రీలకు, పురుషులకు వేరువేరుగా టీములను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి క్రీడకు సంబంధించి ప్రతి ఒక్క సచివాలయం నుంచి రెండు టీములకు తక్కువ కాకుండా ఎంపిక చేయాలని ఆదేశించారు. ఎంపిక చేసిన టీములకు సంబంధించి ఆన్‌లైన్ షెడ్యూల్ అప్డేట్ చేయాలని ఆదేశించారు.

మెంటాడ: మండల కేంద్రంలో శనివారం 'ఆడుదాం ఆంధ్ర'పై వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు, తెట్టంగి దుర్గ ఆధ్వర్యంలో మెంటాడ హైస్కూల్ నుండి ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్ సహాదిత్ వెంకట్ త్రివినాగ్ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి రామకృష్ణ, ఎంపిడిఒ పి. త్రివిక్రమ్ రావు, ఎపిఎం వి సత్యనారాయణ, పొదుపు సంఘాల సభ్యులు, వాలంటీర్లు, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక గ్రామ సచివాలయం నుండి వల్లంపూడి మండల పరిషత్ కార్యాలయం వరకు ఆడుదాం ఆంధ్ర పై శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహ, ఎంపిడిఒ పట్నాయక్, ఇఒపిఆర్‌డి ఉమా, పీడీలు ఈ నెల 26వ తేదీ నుండి ప్రారంభించనున్న ఆటలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి డి. సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్, పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ఆడుదాం ఆంధ్రాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ జి.రామారావు, నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ పిలుపునిచ్చారు.

బొబ్బిలి: ర్యాలీ చేస్తున్న నాయకులు, అధికారులు

శనివారం నగర పంచాయతీలో ఆడుదాం ఆంధ్ర పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను వెలికితీయడానికి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా అనే కార్యక్రమం చేపట్టిందన్నారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో 15సంవత్సరాలు నిండి ఆసక్తి ఉన్న యువతీ యువకులను కార్యక్రమంలో చేర్పించ డానికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.సింహాద్రి, నగర పంచాయతీ మేనేజర్ టివిఎస్ విశ్వేశ్వరరావు, ఎంఇఒలు యు. సూర్య నారాయణ మూర్తి, ఈపు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: గజపతినగరంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. జెడ్‌పిటిసి గార తవుడు, ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక, బెల్లాన త్రినాధ్‌రావు పాల్గొన్నారు.

ముగిసిన అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి- డెంకాడ

ఎంవిజిఆర్ సివిల్ డిపార్ట్‌మెంట్‌లో ఏఐసిటిఇ స్పాన్సర్ చేసిన 6 రోజుల అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శనివారం ముగిసింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్, ఎం.వి.జి.ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో భవిష్యత్తు ట్రెండ్‌లపై ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నై ఎల్అండ్‌టికి చెందిన దాసం కిషోర్‌కుమార్ మాట్లాడుతూ దాసమ్, మల్టీడిసిప్లినరీ టీమ్‌ల మధ్య మెరుగైన సహకారం ద్వారా ప్రాజెక్ట్ నిర్వహణను మార్చడంలో బిఐఎం సాఫ్ట్వేర్ యొక్క కీలక పాత్రను వివరించారు. డిజైన్, విశ్లేషణ యొక్క సామర్థ్యాన్ని నొక్కిచెబుతూ, వివరణాత్మక 3డి నమూనాలు తయారీలో దీని పాత్రపై చెప్పారు. ఈ వాలిడెక్టరీ ఫంక్షన్‌లో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేస్తున్న కిషోర్‌కుమార్

పి.మార్కండేయ రాజు, కోఆర్డినేటర్ డాక్టర్ మురళీ సాగర్ వర్మ సాగి, కన్వీనర్, హెచ్ఒడిలు, సివిల్ ఇంజినీరింగ్ అధ్యాపకులు, పీజీ విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలి

డాక్టర్ పి.రామ్‌కుమార్

ప్రజాశక్తి- బొబ్బిలి

మహిళలు మరి ముఖ్యంగా యుక్త వయస్సులో ఉన్న యువతులు ఆరోగ్యకరమైన జీవన శైలిని తప్పనిసరిగా పాటించాలని ప్రముఖ స్త్రీల, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ పి. రామ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక గాయత్రి జూనియర్ కాలేజ్‌లో బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు ఆధ్వర్యంలో 'ఋతుక్రమం, మహిళల ఆరోగ్య సమస్యలు' అనే విషయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ కుమార్ మాట్లాడుతూ సరైన పోషకాహారాన్ని తీసుకోక పోవడం, పని ఒత్తిడి, అలసట, మానసిక సమస్యల కారణంగా మహిళలను ఇటీవల కాలంలో అనేక ఆరోగ్య సమస్యలు వేదిస్తున్నాయన్నారు. ప్రధానంగా గైనిక్ సమస్యలతో బాధపడుతున్నారని చెప్పారు. స్త్రీల సమస్యలైన జననేంద్రియాలకు చెందిన కేన్సర్, స్త్రీల మూత్ర వ్యవస్థ, ఋతుచక్రం సమస్యలు, గర్భసంచి జారటం జననేంద్రియాలకు చెందిన వివిధ భాగాలలో ఇన్ఫెక్షన్ వల్ల కలిగే సమస్యల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం గాయత్రి డైరెక్టర్ చుక్క రమణ రామ్‌కుమార్‌ని సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఐ సిఇఒ శ్రీనివాసన్, రోటరీ క్లబ్ యూత్ చైర్ డేవిడ్ జె విక్టర్, చంద్రనాయుడు, కాలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

తంగుడుబిల్లిలో 'మన ఊరిలో జనవాణి'

ప్రజాశక్తి - నెలిమర్ల

మండలంలోని తంగుడుబిల్లిలో జనసేన ఆధ్వర్యంలో శనివారం రాత్రి మన ఊరిలో జన వాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నియోజక వర్గం ఇంఛార్జి లోకం మాధవి గ్రామంలో ఇంటింటికి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులతో మాట్లాడుతూ ఈ దుష్ట పాలనని అంతమొందించి ప్రజా పాలనకు నాంది పలకాలన్నారు. ఎన్నికలకు ముందు వచ్చి చేయలేని వాగ్దానాలు ఇచ్చినందు వల్లనే నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుబడిందన్నారు. గ్రామంలో నిరుద్యోగ యువత కలిసి వారికి ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఇన్ని ప్రభుత్వాలు మారినా గ్రామానికి వచ్చే రోడ్డుపైన ఇప్పటివరకు దృష్టి పెట్టలేదన్నారు. వైసిపి నాయకులు పంచాయతీ నిధులని అడ్డగోలుగా నొక్కేసి ప్రజలను మోసం

జనసేన సిద్ధాంతాలను వివరిస్తున్న మాదవి

చేస్తున్నారని మండిపడ్డారు. తాను అధికారంలోకి వస్తే తంగుడిబిల్లి స్థితిగతులను మార్చే బాధ్యతను తాను తీసుకుంటానని, ప్రతి ఇంటికి కులాయి తెప్పించే చొరవ తాను తీసుకుంటానని లోకం మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో కరుమజ్జి గోవింద, శేఖర్, రామ్‌నాయుడు, మధు, సాకేత్, అప్పల నాయుడు, జనసేన వీర మహిళలు పాల్గొన్నారు.

కంటకాపల్లిలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - కొత్తవలస

శారదా కర్మా గారం ఆధ్వర్యంలో కంటకాపల్లి గ్రామ సచివాలయం వద్ద శనివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహి ంచారు. ఈ క్యాంపులో షుగర్, హార్ట్, ఈసీజీ, ఐ, ఇతర వ్యాధులకు తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అప్పల రమణ, కాటకాపల్లి సర్పంచ్ పీతల కృష్ణ, శారదా కంపెనీ సీనియర్ జి.ఎం.ప్రభాత మోహన్, హెచ్. సన్యాసి రావు, మురళీకృష్ణ, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ వెంకటరావు, డాక్టర్ ఎన్.వి. ప్రసాద్ జనరల్ మెడిసిన్, డాక్టర్ ఎస్. యోగ నాథ్, కంపెనీ హెచ్ ఆర్ సీనియర్ శంకర్ రావు, సంతోషి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విజయనగరం టౌన్ : నగరంలోనికొత్త ధర్మపురిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న రహదారి పనులకు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ కొత్త ధర్మపురిలో ఎన్నో ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నట్లు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పర్యటించిన సందర్భంగా స్థానిక ప్రజలు వివరించారన్నారు. దీనికి స్పందించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి రూ.17 లక్షల నిధులతో రహదారి సౌకర్యాన్ని కల్పిస్తున్నారని తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

భోగాపురం: భోగాపురం విద్యుత్ 33/11 కెవి సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ నిమిత్తం ఆదివారం మూడు గ్రామాలకు విద్యుత్తు అంతరాయం ఉంటుందని ఎ.ఇ షేక్ మస్తాన్ వలీ తెలిపారు. ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు భోగాపురం, సుందర పేట, సిహెచ్ గొల్లపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ధాన్యం మిల్లులపై కొరడా

- బ్లాక్ లిస్టులోకి సూర్యరాజు మిల్లు
- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - జామి

ధాన్యం మిల్లులపై జెసి కొరడా ఝులిపించారు. గంట్యాడ మండలం రాయవలసలోని సూర్యరాజు మిల్లును బ్లాక్ లిస్టులో పెట్టారు. ' ధాన్యం కొనుగోలులో బరితెగింపు' అనే శీర్షికతో ప్రజాశక్తిలో శనివారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై జెసి మయూర అశోక్ స్పందించారు. జామి గ్రామానికి చెందిన పలువురు రైతులు కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ప్రధానంగా అదనపు ధాన్యం డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో జిల్లాలోని అన్ని మిల్లులకు కీలక అదేశాలు జారీ చేశారు. మిల్లుల వద్ద ధాన్యం దించుకోకుండా జాప్యం చేసే మిల్లర్ల పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ నేపథ్యంలోనే పౌర సరఫరాల అధికారులు మిల్లులపై విచారణ జరిపారు. రైతుల నుంచి అదనపు ధాన్యం వసూలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందులో భాగంగానే సూర్యరాజ మిల్లును బ్లాక్ లిస్టులో పెట్టారు. రైతులకు ఇబ్బంది లేకుండా, నిబంధనలు పాటిస్తూ, కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని అధికారులు అన్ని మిల్లులకు అదేశాంచారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

జెసి ఆదేశాల్లో భాగంగా గంట్యాడ మండలంలో పలు మిల్లుల్లో విచారణ చేపట్టాం. సూర్యరాజు మిల్లు డీ ట్యాగ్ చేయడం జరిగింది. ధాన్యం కొనుగోలు పై జాప్యం జరగకుండా చూడాలని అన్ని మిల్లుల యాజమాన్యలకు అదేశాలు జారీ చేశాం.

- మధుసూధన్, డిఎస్ఒ, విజయనగరం

పోర్టుసిటీలో లెర్నింగ్ ఫెస్ట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శ్రీనివాస రామనుజన్ జయంతి సందర్భంగా నగరంలోని పోర్టుసిటీ పాఠశాలలో లెర్నింగ్ ఫెస్ట్ ఘనంగా జరిగింది. సుమారు 1000 ప్రాజెక్టులను విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చి సృజనాత్మకతతో తయారు చేసి ప్రదర్శించారు. గణితం, సైన్స్‌కు సంబంధించిన ప్రాజెక్టులను మాత్రమే కాకుండా తెలుగు, హిందీ, ఇంగ్లీషు, సోసల్, కంప్యుటర్, వ్యాయామవిద్య, ఆర్ట్స్, డాన్స్. సంగీతం తదితర విషయాలపై విద్యార్థులు ఉపాధ్యాయులుగా, తల్లిదండ్రులుగా పాత్రను పోషించారు. పాఠశాల చైర్మన్ కె.ఎ.పి.రాజు (శివ) మాట్లాడుతూ ఇటువంటి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయని, విద్యార్థుల విద్యా వ్యాప్తికి బాగా దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కొన్ని ప్రాజెక్టులు నిజజీవితంలో ఉపయోగపడే విధంగా ఉన్నాయన్నారు. ఈ లెర్నింగ్ ఫెస్ట్‌లో పలు ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులను పాఠశాల వైస్ చైర్మన్ చంటి , ప్రిన్సిపల్ రాయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమా అభినందించారు.

ప్రాజెక్టులను పరిశీలిస్తున్న స్కూల్ చైర్మన్

లారీ ఢీకొని యువకుడు మృతి

మరో యువకుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మోధవలస వద్ద 43వ జాతీయ రహదారిలో శనివారం మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖలోని గోపాలపట్నంకు చెందిన ఇంతియాజ్ (27) కే. శేఖర్ ఇద్దరూ మోటార్ సైకిల్ పై విశాఖపట్నం నుంచి విజయనగరం వెల్డింగ్ పని చేయడానికి వస్తున్నారు. మోధవలస 43వ జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి అదే రహదారిలో వారి వెనక వస్తున్న లారీ బలంగా ఢీకొనడంతో మోటార్ సైకిల్‌తో లారీ వెనుక చక్రాల క్రింద మోటార్ సైకిల్ నడుపుతున్న ఇంతియాజ్ పడిపోయాడు. దీంతో తలపై నుంచి లారీ వెనుక చక్రాలు వెళ్లిపోవడంతో ఇంతియాజ్ తల నుజ్జు నుజ్జు అయిపోయి అక్కడకక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న శేఖర్‌కు రెండు చేతులు విరిగిపోయాయి. దీంతో వెంటనే స్థానికులు 108 ద్వారా విజయనగరం ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఎస్ఐ యు మహేష్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని విజయనగరం ఆసుపత్రికి తరలించి మృతుని భార్య మార్ష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఇంతియాజ్‌కు ఈ మధ్యనే పెళ్లయి గోపాలపట్నంలో నివాసముంటున్నారు. అతని తల్లిదండ్రులు విదేశాల్లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంతియాజ్(ఫైల్)

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా పడి మహిళ మృతి

మరో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు

గరివిడి: ట్రాక్టర్ బోల్తా పడి మహిళ మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలో వెదుళ్ల వలసలో కొంత మంది మహిళా కూలీలు ట్రాక్టర్‌తో వరి చేను తరలించారు. సాయంత్రం ఇంటికి తిరిగొచ్చే ప్రయాణంలో ఊరు ముందు ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ప్రమదంలో ట్రక్ పై కూర్చున్న కోరాడ అప్పల నరసమ్మ (58) మృతి చెందగా, భార్నాల సూర్య కాంతంకు చెయ్యి, పాండ్రింకి విజయకు కాలు విరిగి పోయింది. దీంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

ఘటనా స్థలంలో మృతి చెందిన కోరాడ అప్పలనరసమ్మ

సీతంలో ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా 'కల్టివేటింగ్ ది ఫ్యూచర్.. ఇన్నోవేషన్ అండ్ సస్టైనబిలిటీ ఇన్ అగ్రికల్చర్' అనే అంశంపై ఒక రోజు సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోయంబత్తూర్‌కు చెందిన శర్వణన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి రైతు వెన్నుముక అని, అటువంటి రైతును గౌరవించుకోవడం ఎంతో అవసరమని అన్నారు.

సీతం కాలేజి డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ ఆహార భద్రతకు భరోసా కల్పించడంలో రైతులు ముఖ్యపాత్ర పోషిస్తున్నారని, వారి జీవనోపాధిని మెరుగుపరిచేందుకు సమగ్ర సహాయక వ్యవస్థల ఆవశ్యకత ఎంతయినా ఉందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి. రవికిషోర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

IN THE HONORABLE COURT OF THE SENIOR CIVIL JUDGE VIZIANAGARAM
I.P. 2/2022. IA. 25/2022

Between:
Paluri Srinivasa Rao, ...Petitioner
And
Matcha Siva Prasad and others
R-1: Matcha Siva Prasad, S/o late Viswanadham, aged 47 years, Hindu, Residing at D. No. 20-21-33, Vinayaka Nagar, Ring Road, Vizianagaram. .....Respondents

NOTICE.

Take notice that the Petitioner filed the above insolvency petition against the respondents for adjudicating the 1st respondent as insolvent and for declaring the sale deed dated 28-01-2021 in favour of the respondents 2 and 3 executed by the 1st respondent in respect of RCC building bearing Door No. 20-9-1, of Plot No. 54, Swami Avenue Layout Vizianagaram is void and for other reliefs. The said petition stands posted to **02-01-2024** and if anybody got any objection they can appear in person or through an advocate and file objections if any on **02-01-2024 at 10-30 A.M** in the above Court.

L.SATYANARAYANA.
Advocate for the Petitioner.
VIZIANAGARAM-5356

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE, AT VIZIANAGARAM.
O.S.401/2016 :: I.A.351/2019 :: I.A.69/2022

Between:
Althi Nagaraju ......Petitioner/ Plaintiff
And:
Smt. Chandaka Narayanamma (Died) and others ....Respondents/ Defendants
To
R-4 Smt. Althi Appayyamma, W/o late Venkata Ramana, Aged 58 years, Hindu, Residing at Diguva veedhi, Gajularega, Vizianagaram.
R-6 Smt. Konchada Padma, W/o Ramana, aged 52 years, Hindu, Housewife, Residing at Rapaka Village, Ponduru Rev. Mandal, Srikakulam District.
R-7 Smt. Chandaka Janaki Devi, W/o late Govinda Raju, Aged 43 years, Hindu, Resident of Kamsali veedhi, Kanapaka, Vizianagaram
R-8 Chandaka Bhuvaneswar, S/o late Govinda Raju, Aged 21 years, Hindu, Resident of Kamsali veedhi, Kanapaka, Vizianagaram
R-9 Kum. Chandaka Kethana, D/o late Govinda Raju, Aged 20 years, Hindu, Resident of Kamsali veedhi, Kanapaka, Vizianagaram

NOTICE.

Take notice that the petitioner filed the above petition to add the L.Rs., of the deceased 3rd respondent in I.A. 69/2022 in I.A. 351/2019 in O.S. 401/2016 which was filed for Specific Performance and the said petition stands posted to 28-12-2023 for notice to you. If you got any objection in the above petition you can appear in person or through an advocate and file your objections if any on **28-12-2023 at 10-30 A.M** in the above Court.

L.SATYANARAYANA.
Advocate for the Plaintiff
Vizianagaram